www.prajasakti.com

# ప్రజాశక్తి

బుధవారం 4 అక్టోబర్ 2023





## 5 లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని రంగస్థల కళాకారులు గుర్తింపు కార్డుల కోసం అక్టోబర్ 5న లోపల తమ దరఖాస్తులను సమర్పించాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి. వేణుగోపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు అర్హులైన రంగస్థల కళాకారులు కొత్త గుర్తింపు కార్డులను పొందడానికి కమిషనర్ వారు సూచించిన ప్రొఫార్మా ప్రకారం జెండర్, బ్లడ్ గ్రూపు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, చిరునామా, జిల్లా, కళా రూపం, అనుభవం, మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్ ఇ-మెయిల్ అడ్రస్ మొదలైన వివరాలను తెలుపుతూ సంబంధిత ఆధారాల నకలు ప్రతులను జతచేసి తమ దరఖాస్తులను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

# మోడీ విధానాలకు వ్యతిరేకంగా బ్లాక్ డే

### వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో హెడ్ పోస్ట్ ఆఫీస్, బిఎస్ఎన్ఎల్ కేంద్ర కమిటీ వామపక్ష రైతు కార్మిక సంఘాల పిలుపుమేరకు బ్లాక్ డే నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వామపక్ష రైతు కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, కె. శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, ఎం.వి. సుబ్బారెడ్డి, అన్వేష్, సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులపై కాల్పులు జరిపి ప్రాణాలను బలి తీసుకున్న ఘటనకు బాధ్యుడైన మంత్రిని బర్త్ రఫ్ చేయాలని నిరసనగా దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, తొమ్మిదేళ్ల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీల రుణాలు మాఫీ చేయడం కాదని, మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గు గనులు, చివరకు ఆదివాసి, గిరిజనుల అటవీ భూములపై హక్కులను హరిస్తూ తాజాగా అటవీ చట్టానికి సవరణ పాస్ చేసిందని విమర్శించారు. చర్యలన్నీ కార్పొరేట్లకు ప్రత్యేకంగా మోడీ మానస పుత్రుడు గౌతమ్ అదానీని ప్రపంచ కుబేరులలో మొదటి స్థానానికి చేర్చేందుకు దోహదపడ్డాయన్నారు. మరోవైపు కార్మికుల హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఫలితంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లాభాలు పెంచి ప్రజల సంపదలు లూటీ చేస్తున్న కార్పొరేట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ రైతాంగం సందర్భంగా కేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. వెంటనే కేంద్ర మంత్రిని తొలగించాలని లేనిపక్షంలో కేంద్ర మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బ్లాక్ డే నిరసన కార్యక్రమానికి సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, జి.చంద్రశేఖర్, సిపిఎం నగర్ కార్యదర్శి ఎం. రామ్మోహన్ సంఘీభావం ప్రకటించారు. నిరసన కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య, చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు మనోహర్ రెడ్డి, చంద్రయ్య, శంకర్ రెడ్డి, ఎఐటియుసి నగర అధ్యక్షులు మదిలేటి, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, మహిళా సంఘం నాయకులు రాజామణి పాల్గొన్నారు.

నిరసనలో వామపక్ష రైతు సంఘాల నాయకులు

**జమ్మలమడుగు :** మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక, రైతుల పక్షాన కార్మిక వర్గం తరఫున సిఐటియు ఆధ్వర్యంలో జమ్మలమడుగు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రైతులపై కాల్పులు జరిపి వారి ప్రాణాలను బలి తీసుకున్న ఘటనకు బాధ్యుడైన మంత్రిని బర్త్ రఫ్ చేయనందుకు నిరసనగా దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, ఈ 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని చెప్పారు. ఢిల్లీ రైతాంగం సందర్భంగా కేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్లాక్ డే నిరసనకు సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మొరగుడి దాసు దాసరి. విజయ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు విజయకుమార్ సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.




కడప : బిఎస్ఎన్ఎల్, తపాలా కార్యాలయాల వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు

# పరీక్షలు విద్యార్థులకా? ఉపాధ్యాయులకా?

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎఫ్ఎ-2 పరీక్షలు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేవిగా కాకుండా ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించేవిగా ఉన్నాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆరోపించారు. మంగళవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యత నిచ్చి వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు చెప్పుకుంటుందని, విద్యార్థులకు నిర్వహించాల్సిన పరీక్ష ప్రశ్నా పత్రాలను ప్రింటింగ్ చేయడానికి కావాల్సిన నిధులను విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందని వాపోయారు. సెల్ ఫోన్‌లో ప్రశ్నాపత్రాలను చూసుకుని విద్యార్థులకు బోర్డుపై రాసి పరీక్షలు నిర్వహించాలని తెలపడం వల్ల ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇలా ప్రశ్నాపత్రాలు వాట్స్‌అప్ గ్రూపుల్లో రావడం వల్ల ఆ పరీక్షలకు తగిన ప్రాధాన్యత లేకుండా పోతుందని చెప్పారు. ప్రశ్నాపత్రాలు ముద్రించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉన్నప్పుడు ఎక్కడికక్కడ ఆయా పాఠశాలల్లోనే ప్రశ్నా పత్రాలు తయారు చేసుకోమని ఉపాధ్యాయులకు ఉత్తర్వులు ఇచ్చినా సరిపోయేదని తెలిపారు. పాఠశాలలకు రావాల్సిన నిధులు ప్రభుత్వం విడుదల చేయక పోవడం వల్ల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పేపర్లు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. చివరికి ఉపాధ్యాయులే సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని ప్రశ్నాపత్రాలు సమాధాన పత్రాలు తీసుకువచ్చి విద్యార్థులకు ఇచ్చే దుర్భర పరిస్థితుల్లో రాష్ట్రంలో నెలకొన్నాయని చెప్పారు. ప్రశ్నాపత్రాలను బోర్డు మీద రాయడానికి గంటకు పైగా సమయం పడుతుంటే విద్యార్థులు సమాధానాలు ఎప్పుడు రాయాలో దిక్కు తెలియని స్థితిలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా డిసిఇబిలకు తగిన నిధులను విడుదల చేసి ప్రశ్నాపత్రాలు ప్రింటింగ్ చేసి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇలాంటి పరీక్షల వలన విద్యార్థుల నుంచి ఆశించిన స్థాయిలో ఫలితాలు పొందలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎజాస్ అహ్మద్, నాయకులు గోపీనాథ్, వెంకటరమణ, జమాల్ బాషా, సిద్దయ్య, జావిద్, కరిముల్లా, కిరణ్ కుమార్, జి. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

# అభివృద్ధి జీవోలు కాగితాలకే పరిమితం

### అప్పులు తెచ్చి పింఛన్లు, జీతాలు
### దీక్షల్లో ప్రశ్నిస్తామనే.. హౌస్ అరెస్టులు
### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి పనులకు రూ.15 వేల కోట్లు జీవోలు ఇచ్చి, 2021కి పూర్తి చేస్తామన్న హామీలు ఏమయ్యాయని, ఇచ్చిన జీవోలు కాగితాలకే పరిమితం అయ్యాయని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ద్వారక నగర్ లోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలాఖరులో రిజర్వ్ బ్యాంకుకు వెళ్లడం, తెచ్చిన డబ్బులు పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం రాష్ట్ర ఆర్థిక దుస్థితికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి లేదుగానీ, రాష్ట్రంలో 144 సెక్షన్, దీక్షలు చేస్తే హౌస్ అరెస్టులు వీటికి ఏమాత్రం తక్కువ లేదని ఎద్దేవా చేశారు. అవినీతి తెలియని చంద్రబాబును అక్రమ కేసుతో జైలుకు పంపారని, ఇప్పుడు లోకేష్ ను జైలుకు పంపడానికి సిద్ధమయ్యారని చెప్పారు. ఓటమి భయంతో, తిరిగి గెలిచేందుకు ఎంతమంది నేతలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపుతారని ప్రశ్నించారు. టిడిపి నేతలను జైళ్లకు పంపి ఎన్నికల్లో గెలుస్తామనే జగన్ రాజకీయ కుట్రలను, ప్రజలు తిప్పి కొడతారని హెచ్చరించారు. రాష్ట్రంలో పెట్టుబడి లేదు, పోలవరం, నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్న జగన్, ఆ ఆలోచన చేయలేదని అన్నారు. అక్రమ అరెస్టులు చేసి, జైళ్లకు పంపి, బయటికి రాకుండా ఉంచేందుకు, ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారని ఆరోపించారు. న్యాయం, ధర్మం ఉన్నాయి కాబట్టి, జైలు నుంచి వచ్చిన చంద్రబాబుకు ప్రజలు బ్రహ్మ రథం పట్టి, అధికారం ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి మాట్లాడుతూ అధినేత చంద్రబాబు సత్యమేవ జయతే, దీక్షకు మద్దతుగా, రిలే దీక్షలు చేపడితే భగ్నం చేయడానికి పోలీసులు ప్రయత్నించారన్నారు. శాంతియుతంగా దీక్షలు నిర్వహిస్తే వైసిపి నేతలకు, పోలీసులకు అభ్యంతరం ఏమిటని ఆమె ప్రశ్నించారు. దీక్షా శిబిరాన్ని తొలగించి, హౌస్ అరెస్టులు చేస్తారా అని ఆమె నిలదీశారు. ఎన్ని చేసినా భయపడే ప్రసక్తే లేదని, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వైసిపి దుర్మార్గ పాలన తీరును తెలియ పరుస్తామన్నారు. ఓట్లు వేసి తప్పు చేశామని ప్రజలు గ్రహించారని, వైసిపి ఎమ్మెల్యేను ఇంటికి పంపిస్తారని చెప్పారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీమలో పుట్టిన వ్యక్తి ధర్మ యుద్ధమే చేస్తారని, జగన్ అధర్మ యుద్ధం చేస్తున్నాడని అనుమానాన్ని వ్యక్తపరిచారు. ఆనాటి బ్రిటిష్ పాలనకు, జగన్ నిరంకుశ పాలన తీసిపోదన్నారు. కేసులకు, అరెస్టులకు టిడిపి కుటుంబం ఇప్పటికీ ఎప్పటికీ భయపడదని, జగన్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడం ఖాయమని ఆయన హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

# నకిలీ బీమా ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప

నకిలీ ఇన్సూరెన్స్ తయారు చేస్తున్న ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎస్‌పి సిద్ధార్థ కౌశల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ వాహనాలకు ఇన్సూరెన్స్ చేయడమంటే ఆ వాహనంలో ప్రయాణించే డ్రైవర్‌తో సహా ప్రయాణికులకూ ప్రమాదమేనన్నారు. వాహనం ద్వారా ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడకుండా వారి కుటుంబాలకు జీవనోపాధికి, ఆర్థికంగా భద్రత కల్పించేది వెహికల్ ఇన్సూరెన్స్ అన్నారు. కానీ వెహికల్ ఇన్సూరెన్స్ చేయించాలంటే వేలకు వేలు ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ చేయించాల్సి ఉంటుంది అని తెలిపారు. కొంతమంది దొంగ ఏజెంట్లు ఆటోలకు వెహికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటే దొంగ ఏజెంట్లు రూ. 2 వేలు తీసుకొని ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీల నకిలీ పత్రాలతో వీరే దొంగ సంతకాలు చేసి, దొంగ సీల్లు వేసి నకిలీ ఇస్తున్నారని చెప్పారు. దొంగ ఏజెంట్లు తయారు చేసి ఇచ్చే నకిలీ ప్రీమియం కారణంగా సదరు వాహనానికి గానీ, వాహనంలో ప్రయాణించే వారికి గాని ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు బీమా వర్తించదని చెప్పారు. బాధితులకు ఒక్క రూపాయి కూడా రాదు అని చెప్పారు. ఇలాగే టూ వీలర్స్‌కు ఇతర వాహనాలకు కూడా దొంగ ఇన్సూరెన్స్ లు తయారు చేస్తున్నారు ఉన్నారు. ఈ విషయమై గతంలో ఎస్‌పి అన్బురాజన్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. తాత్కాలికంగా కొంతకాలం ఆగినా కానీ మళ్లీ విజృంభిస్తున్నారని తెలిపారు. అవగాహన లేని వారు మోసపోకుండా నకిలీ ఏజెంట్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఎస్‌పిని కలిసిన వారిలో బిసి సెల్ జిల్లా చైర్మన్ కులాయప్ప, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

## మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు భారీ స్కోరు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ఎసిఎ సౌత్ జోన్ అండర్-23 మెన్ మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా కెఒఆర్ఎ క్రికెట్ మైదానంలో ప్రారంభ మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. నెల్లూరు జట్టుకు చెందిన పి. సుబ్రహ్మణ్యం సెంచరీ( 157 పరుగులు) చేయడంతో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 354 పరుగుల భారీ స్కోరు సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 78.2 ఓవర్లలో 354 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని పి. సుబ్రహ్మణ్యం బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించాడు. 204 బంతులను ఎదుర్కొని 24 బౌండరీలు సహాయంతో 157 పరుగులు( సెంచరీ) చేశాడు. పి. రోషన్ పవన్ కుమార్ 51 పరుగులు చేశాడు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. ఎం. విజయ రాఘవేంద్ర రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 21 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సాకేత్ రామ్ 2, సాత్విక్ 2 వికెట్లు తీసుకున్నారు.

### 243 పరుగులకు మొదటి నుంచి డిక్లేర్ చేసిన చిత్తూరు జట్టు

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో చిత్తూరు గట్టు తన మొదటి ఇన్నింగ్స్‌ను 9 వికెట్ల నష్టానికి 243 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్ లో 80.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి రెండు వందల నలభై మూడు పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని ధరణి కుమార్ నాయుడు 77, అజిత్ కుమార్ 46 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని జి. మల్లికార్జున అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 8.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 16 పరుగులు చేసింది.

## గిరిజనుడి వైద్యానికి సాయినాథశర్మ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చెన్నూరు

కమలాపురం నియోజకవర్గ టిడిపి నాయకులు, పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కాశీభట్ల సాయినాథ్‌శర్మ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని దౌలతాపురం యానాది కాలనీకి చెందిన కసిరి చంద్రయ్య అనే గిరుజనుడి వైద్యం కోసం ఆర్థిక సాయం ఆదుకున్నారు. ఇటీవల బాధితుడు గ్రామంలో స్పృహ తప్పి పడిపోగా అతన్ని సాయినాథశర్మ అభిమానులు పరామర్శించారు. మంగళవారం ఛారిటబుల్ ట్రస్టు తరుపున వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం చేయడంతోపాటు కడపలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో కాలనీ వాసులు సాయినాథ్‌శర్మకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డితో పాటు, పదవ వార్డ్ మెంబర్ కిట్టయ్య, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, అంకయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న సాయినాథ్‌శర్మ అభిమానులు

# ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

### - ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రాన్ని ఆరోగ్య వంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నకాశ్‌వీధి పెద్ద దర్గా ప్రాంత సమీపంలోని ఖాళీ ప్రదేశ మైదానంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మండి బజార్, బల్లారి రోడ్డు, అబ్దుల్ నబీ స్ట్రీట్, ఖలీల్ నగర్, నకాశ్ ప్రాంతాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష 2వ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సూర్య రమణా రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, యువనాయకుడు ఎస్. బి. అహమ్మద్ బాషా, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, సుబాన్ బాషా, చాక్లెట్ గౌస్, పవర్ అల్తాఫ్, రిజ్వాన్, కార్పొరేటర్లు అరీఫుల్లా, జహీర్, అక్బర్ అలీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు, వైద్యులు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **చెన్నూరు :** ఈనెల 5 నుంచి 24 వరకు నిర్వహి ంచబోయే జగనన్న ఆరోగ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. మంగళవారం ఎంపిడిఒ సభాభవనంలో ఎంపిడిఒ డి. సుబ్రహ్మణ్యంశర్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రతి గ్రామంలో ఆయా ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్( చిన్న), సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామ్మూర్తి, డిప్యూటీ కాసుల వెంకటరమణ, ఒపిఆర్‌డి సురేష్‌బాబు వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దిలీప్ కుమార్ రెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను సుబ్బారెడ్డి పాల్గొన్నారు **ముద్దనూరు :** జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని జిఎస్ ఎస్ఎస్ కలెక్టర్ రాము నాయక్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని నల్లబల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం మండల సచివాలయం కన్వీనర్ చింతాటి సుమంత్ యాదవ్, సర్పంచ్ గుగ్గిళ్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు రామారెడ్డి, వైసిపి, సింగిల్ విండో డైరెక్టర్ శివారెడ్డి, వైసిపి నాయకులు మణికంఠరెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రజలు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు :** ప్రజలకు వైద్యం అందుబాటులోకి తేవడడే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని భద్రిపల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వైద్య సేవల తీరును పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి టి లక్ష్మమయ్య, నియోజకవర్గ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ యామిని, మండల వైద్యాధికారులు రాజేష్‌కుమార్, శ్రీవాణి, ఎంఎస్ తేజ, సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైసిపి నాయకులు పివి రమణారెడ్డి, అబ్బిరెడ్డి, ఓబుళరెడ్డి, శ్రీనువాసులరెడ్డి, రామాంజనేయులరెడ్డి, నరసింహారెడ్డి, పుల్లయ్య, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని కాన్పులాసుపత్రి, ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ లక్ష్మీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్లు బంగారు మునిరెడ్డి, జేపిఎస్, జిల్లా కో-ఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రరెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్, గరిశపాటి లక్ష్మీదేవి, పోరెడ్డి నరసింహారెడ్డి, కమాల్‌బాషా, మల్లికార్జున యాదవ్, వరికూటి ఓబుల్‌రెడ్డి, దేవి, జిలానీ, సత్యం, వంశీధర్‌రెడ్డి, కశిరెడ్డి మహేశ్వరరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ప్రజా ఆరోగ్యానికే ప్రభుత్వం మొదట ప్రాధాన్యతనిస్తుందని, అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సాయిబాబా దేవాలయం వద్ద ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్ పోరెడ్డి రామలక్ష్మమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** వైసిపి ప్రభుత్వం పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రావులపల్లెలో జగనన్న సురక్ష యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై వైద్య సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి అబూబకర్ సిద్దిక్, ఎంపిటిసి కనపర్తి సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు పివి రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, అంగన్వాడీ కార్యకర్త జంపన గంగావతి, అంగన్వాడీ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

## బలిజల ఆస్తుల కబ్జాకు డిప్యూటీ సిఎం యత్నం

### - టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలో బలిజల ఆస్తులను కబ్జా చేసేందుకు ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రయత్నిస్తున్నారని, వక్ఫ్ బోర్డు పేరుతో స్థలాలను కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ ఆరోపించారు. బలిజ నేత అతికారి వెంకటయ్య స్థలం వివాదంలో ఉందంటూ అధికారులతో బోర్డు పెట్టించడమే నిదర్శనమన్నారు. హరిటవర్స్‌లో మంగళవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 1న చంద్రబాబు అక్రమ అరెస్టు నిర్బంధానికి నిరసనగా బలిజలు పెద్ద ఎత్తున చేపట్టిన ర్యాలీ సామూహిక నిరాహారదీక్ష విజయవంతం అయిందన్నారు. కార్యక్రమానికి బలిజలను రాకుండా చేసేందుకు అంజాద్ బాషా చేయని ప్రయత్నం లేదన్నారు. దీంతో దిక్కుతోచని ఆయన నిరాహారదీక్ష నిర్వహించిన స్థలం వక్ఫ్ బోర్డుది అంటూ అధికారులను, పోలీసులను పంపి గాంధీ జయంతి రోజున టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి చేపట్టిన దీక్షను భగ్నం చేసేందుకు ప్రయత్నించారన్నారు. అర్ధరాత్రి ఎవరు లేని సమయంలో పోలీసుల పహారాలో నిరాహారదీక్ష శిబిరాన్ని తొలగించి బోర్డు పెట్టించడం దుర్మార్గమని చెప్పారు. బలిజల ఆస్తులను కాజేసేందుకు రాజ్యాంగ పరంగా ప్రజలకు సంక్రమించిన హక్కులను కాలరాసేందుకు జంజాద్ బాషా చేస్తున్న కుట్రలపై న్యాయ పోరాటానికి సిద్ధమన్నారు. సమావేశంలో జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు, బలిజ సాంఘీయులు గంధంప్రసాద్ నాగరాజు, బాలకృష్ణ, తోట రామచంద్రయ్య, దండు సుబ్బారాయుడు న్యాయవాది భరణి కుమార్ పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ నిర్మాణంతో యువతకు ఉపాధి

ప్రజాశక్తి - కడప

కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా పరోక్షంగా వేల మంది యువతకు లబ్ధి చేకూరుతుందని వారికి ఉపాధి దొరుకుతుందని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనల వల్ల, వైసిపి చేతకానితనం వల్ల కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తి కావడం లేదని విమర్శించారు. గతంలో టిడిపి, ఇప్పుడు వైసిపి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దగ్గర మోకరిల్లడం వల్లనే ఆంధ్రప్రదేశ్‌కు, కడపకు రావాల్సిన స్టీల్ ప్లాంట్ నిర్మాణం జాప్యం జరుగుతుందని ఆయన అన్నారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ పూర్తయితే రాయలసీమ జిల్లాలోని కార్మికులకు ప్రత్యక్షంగా 20,000 మందికి, పరోక్షంగా 20,000 మందికి, ఉద్యోగ అవకాశాలు కలు గుతాయని అన్నారు. కడప నగరంలో స్టీల్ ప్లాంట్ సాధనకై ఈనెల 6 న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ర్యాలీని నిర్వహించడం, ఆర్డీవో కార్యాలయం దగ్గర సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కార్మిక నాయకులు పెను బాల విక్కి, హబీబుల్లా, రాజశేఖర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న చెప్పలి పుల్లయ్య



మురుగునీరు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

## మురుగునీరు తొలగింపు

**ప్రజాశక్తి వార్తకు స్పందన**

**ప్రజాశక్తి - ముద్దనూరు**

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల రహదారిలో ఉన్న మురుగు కాలువలో నీరు పొంగిపొర్లుతూ రోడ్డుపై పారుతోంది. దుర్వాసన భరించలేక పోతున్నామని, దోమ కాటుకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను మంగళవారం 'ప్రజాశక్తి' దిన పత్రికలో 'మురుగు నీరుతో అవస్థలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పంచాయతీ అధికారులు మురుగునీరు తొలగించి శుభ్రం చేశారు. మురుగు నీరు తొలగించి రోడ్డు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. సమస్య పరిష్కారమైనందుకు స్థానికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## 17న ఓటర్ల జాబితా ముసాయిదా

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

నియోజకవర్గంలోని ఓటరు జాబితా ముసాయిదాను ఈనెల 17న విడుదల చేస్తామని జమ్మలమడుగు ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ సభాభవనంలో 131 జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. అధికారులతో వాటిపై సమీక్ష చేశామని, నాయకులు కూడా గ్రామస్థాయిలో అధికారులకు సహకరించాలన్నారు. వివిధ పార్టీల నాయకులు, ప్రతినిధులు బూత్‌లెవెల్ అధికారులతో ఎప్పటికప్పుడు అడిగి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. తొలగించాల్సిన, చేర్చాల్సిన ఓట్లను ఈనెల 17 తర్వాత చూసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి, తహశీల్దార్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

## కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

**పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

రాష్ట్ర విభజన సందర్భంగా అనాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్ర ప్రదేశ్‌కు మూడు వరాలు ఇచ్చినట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకహోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహాలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, కడప జిల్లాకు స్టీల్ ప్లాంట్ ఇచ్చే మూడు వరాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రస్తుతం దేశంలోని 10రాష్ట్రాలకు ప్రత్యేకహోదా అమలవుతోందని తెలిపారు. ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనకు ప్రత్యేకహోదా ఇచ్చే శక్తి, తెచ్చే శక్తి గానీ లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించాలని ఆయన కోరారు.

## బాల్య వివాహాలపై సమీక్ష

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో బాల్య వివాహలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వ హించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ జగ న్నాథ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధక చట్టం ప్రకారం అలాంటి వివా హాలు నిర్వహించినా, ప్రోత్స హించినా, వివా హాలకు హాజరైనా చట్ట ప్రకారం శిక్షార్హులని తెలిపారు. పట్టణ పరిధిలోని మత పెద్దలు వివాహాలు చేసే సమయంలో పెళ్లి కుమారుని వయసు 21, పెళ్లి కుమార్తె వయసు 18 సంవత్సరములు ఉన్నట్లు డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహల నివారణకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని పిలుపు నిచ్చారు. సిడిపిఒ ముంతాజ్ బేగం మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల జరుగు అనర్థాలను తెలియజేశారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. సమావేశంలో మత పెద్దలు, కమిటీ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, మెప్మా సిఒ వసంత్, కానిస్టేబుల్ సంజీవ రాయుడు, మహిళా పోలీసులు, శానిటరీ, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలు చేయడం నేరం : ఎంపిపి**

**జమ్మలమడుగు రూరల్ :** బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎంపిపి హరిత తెలిపారు. మంగళవారం ఉదయం మండలంలోని మోరగుడి-2 గ్రామ సచివాలయంలో బాల్యవివాహాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దన్నారు. సర్పంచ్ కొండయ్య మాట్లాడారు. సచివాలయ మహిళా పోలీసు లక్ష్మిదేవి బాల్య వివాహ నిరోధక చట్టం-2006 గురించి, బాల్య వివాహాల వల్ల జరిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, విఆర్‌ఒ నాగన్న, పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రముఖ రంగస్థల నటుడు జయదేవవర్మ మృతి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**



ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు కళాకారుడు ఆర్.వి. జయదేవవర్మ (64) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన వర్మ ప్రవృత్తిరీత్యా నాటక కళాకారుడు. తన 12వ ఏటనే నాటకరంగంలో ప్రవేశించారు. ఇప్పటివరకు 3000 ప్రదర్శనలిచ్చారు. వీరు సత్యహరిశ్చంద్ర, మహిశాసుర మర్ధని, మాయాబజారు, పల్నాటి యుద్ధంలో పాత్రలు పోషించారు. హైదరాబాద్, కర్నూల్, తిరుపతి, నెల్లూరు, అనంతపురం పట్టణాలలోని పరిషత్తు నాటకాలలో పాల్గొని అనేక బహుమతులు పొందారు. ప్రముఖుల నుండి ప్రశంసలు పొందారు. వీరేకాక వీరి తండ్రి నారాయణరాజు కూడా ప్రముఖ నాటక కళాకారుడు. చిన్నపిల్లలను చేరదీసి నాటకాలు వేయించేవారు. వర్మ మృతి పట్ల జిల్లా రచయిత సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, నటులు చంద్రశేఖర్‌రాజు, కంభం పాములేటి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ఎస్‌టి కాలనీలో అక్రమ వెంచర్లు

### అధికారులు ఆదుకోవాలని వేడుకోలు.. అన్నం అడుక్కుని తింటూ వినూత్న నిరసన

**ప్రజాశక్తి - పొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

కొత్తపల్లి పంచాయతీలోని సుందరయ్య కాలనీ సమీపంలోని ఎస్‌టి వారికి ఇచ్చిన స్థలాల్లో కొందరు పెత్తందార్లు అక్రమ వెంచర్లు వేశారని, తమకు న్యాయం చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్‌టిలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసి వెంకటరమణ మాట్లాడుతూ 2013లో 667, 668, 669 సర్వే నంబర్లుగల భూమి స్థానిక సుందరయ్య కాలనీ నివసించే 50 కుటుంబాల ఎస్‌టిలకు కేటాయించారని తెలిపారు. పదేళ్ల అనంతరం కొందరు పెత్తందారుల పేరు మీద రిజిస్టర్ అయి వెంచర్లు చేసుకుం టున్నారని వాపోయారు. ఈ పరిస్థితుల్లో స్థాని కులు వెంచర్లను అడ్డుకొని కలెక్టర్ కార్యాలయం, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగలేదన్నారు. మంగళవారం నుండి రెవెన్యూ కార్యాలయ ఆవరణలో రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా స్థానిక, జిల్లా అధికారులు స్పందించి న్యాయం జరిగేలా పట్టణంలో అన్నం భిక్షాటన చేపడుతామన్నారు. అడుక్కుంటే పెట్టిన అన్నాన్ని ఇక్కడే తింటామన్నారు. ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనుకాడబోమన్నారు. చెన్నమ్మ, హేమంత్, రాంబాబు, సిద్దు, లక్ష్మీ, గంగాధర్, నగేష్, నాగార్జున, నాగన్న సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.



భిక్షాటన చేసుకున్న అన్నం తింటున్న సుందరయ్య కాలనీ ఎస్‌టి వాసులు

# ఇల్లు కూలి మహిళకు గాయాలు

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

పట్టణ పరిధిలోని 11వ వార్డులో ఇల్లు కూలి మహిళ గాయాల పాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి మిద్దె కావడంతో తడిసి మంగళవారం ఉదయం ఒక్కసారిగా కుప్ప కూలింది. ఇంటి యజమాని షేక్ మాబున్నీ ప్రమాద సమయంలో ఇంటిలోనే ఉండడంతో ఇంటి పైకప్పు మీదపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో పెద్దగా శబ్దం రావడంతో పక్కనే ఉన్న వైసిపి నాయకుడు యూసఫ్ ఇతరుల సాయంతో ఇంటిలో ఇరుక్కున్న మహిళను బయటకు తీశారు. గాయాలైన మహిళను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటిలోని టివి, ఫ్రిడ్జ్, కూలర్ తదితర వస్తువులు పగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ఆమె కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోందని, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కూలిపోయిన ఇల్లు, గాయపడిన మహిళ

## నాణ్యతాలోపం లేకుండా పనులు పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత లోపం లేకుండా త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ్ రామరాజు సూచించారు. మంగళవారం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆయన అధికారులతో సమక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ పనులు ఎంత శాతం జరుగుతున్నాయి, ముగింపు దశలో ఏమేమి ఉన్నాయి అనే వాటిపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అంతేకాకుండా నిర్ణీత గడువు లోపు పనులను పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పలు పనులపై చర్చించారు. కార్యక్రమంలో పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, పురపాలక వైస్ చైర్మన్ వైయస్ మనోహర్ రెడ్డి, పురపాలక చైర్మన్ వల్లపు వరప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చీనీ మార్కెట్‌ను పరిశీలించిన ఒఎస్‌డి

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న చీనీ కాయల మార్కెట్‌ను పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. కొన్ని రోజులుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో చీనీ కాయలను రైతులు మార్కెట్‌కి తెచ్చి, అక్కడే వేలంపాట ద్వారా లబ్ధి పొందుతున్నారు. గతంలో వ్యాపారస్తులు సూట్ తీసుకుంటూ రైతులను మోసం చేసేవారు. ఈ విషయాన్ని రైతులు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు వారు స్పందించి పులివెందుల మార్కెట్‌లో చీనీ కాయల మండిని ఏర్పాటు చేశారు. అధికారుల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చీనీ కాయలను వేలంపాట ద్వారా వ్యాపారస్తులు కొనుగోలు చేయడంతో రైతులకు లాభాన్నిస్తోంది. ఈ విషయాలను చైర్మన్ చిన్నప్ప ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డికి వివరించారు. మార్కెట్ స్థితిగతులు, రైతుల లావాదేవీల గురించి ఒఎస్‌డి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు, మార్కెట్ యార్డ్ అధికారులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.




చీనీ కాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 'బాబుతో నేను' అంటూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై ప్రజలకు వివరిస్తూ పట్టణంలోని 40 వార్డు బుగ్రసాదు మఠంవీధిలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో పల్లా లక్ష్మీదేవి, సావిత్రి, బుగ్రసాదు మఠం బాషా, దాదా, అమీర్, పొట్టిపాటి గంగాధర్, సులం జయచంద్ర, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి నల్లబోతుల నాగరాజు, పొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాబివుల్లా కెవి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బారాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

## పత్తి సాగుకు రైతుల్లో ఆసక్తి

**చాపాడు :** మండల పరిధిలో రైతులు పత్తి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో పత్తి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కెసి కాలువకు ఖరీఫ్ సీజన్‌లో నీరు విడుదల కాకపోవడంతో వరి పంటను రైతులు సాగు చేయలేదు. కుందూ నది, బోరుబావుల కింద వరి పంటను రైతులు సాగు చేశారు. కెసి పరిధిలోని రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. గతంలో మినుము, పెసర, జొన్న పంటలను సాగు చేసేవారు. ఈ ఏడాది రైతులు పంటల సాగులో మార్పులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కూరగాయల సాగు, ఇతర ఆరుతడి పంటలు సాగు చేపడుతున్నారు. ప్రస్తుతం పత్తి పంటకు మంచి గిట్టుబాటు ధర ఉండడంతో రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు. చియ్యపాడు, రేపల్లె, భవాని నగర్, జడ్జి గారి కొట్టాలు, బసిరెడ్డిపల్లి గ్రామాల వద్ద పత్తి పంటను రైతులు సాగు చేపడుతున్నారు. దుక్కులు చేపట్టి సాల్లు ఏర్పాటు చేసి విత్తనాలను నాటుతున్నారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలను సేకరించి సాగు చేపడుతున్నారు. గతంలో మండల వ్యాప్తంగా ఐదు పది ఎకరాల్లో మాత్రమే పత్తి పంటను సాగు చేసేవారు. ఈ ఏడాది కాస్త అధికంగా పత్తి సాగుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఇతర ఆరుతడి పంటలు సాగుకు రైతులు చర్యలు చేపడుతున్నారు. విత్తనాల సేకరణలో రైతులు నిమగ్నమయ్యారు.



జడ్జిగారి కొట్టాలు వద్ద నాటుతున్న పత్తి విత్తనాలు



విత్తన విక్రయ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎఒ

## నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి : ఎఒ

**ప్రజాశక్తి - దువ్వూరు**

విత్తన విక్రయాలపై అప్రమత్తంగా ఉన్నామని రైతులు లైసెన్సు కలిగిన విత్తన డీలర్ల వద్దనే రసీదు తీసుకొని విత్తనాలను కొనుగోలు చేయవలసిందిగా మండల వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని విత్తన దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు, లూజు విత్తనాలు అమ్ముతున్నారని తెలిస్తే తనిఖీ చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం విత్తనాలు అమ్మాలని డీలర్లను ఆదేశించారు. ఏదైనా రైతు నుంచి ఫిర్యాదు వచ్చినచో విత్తన చట్టం ప్రకారం డీలర్లపైన చర్య తీసుకుంటామని హెచ్చరించారు. జొన్న, మొక్కజొన్న ఇతర పంటల విత్తనోత్పత్తి అంటే క్రాసింగ్ చేయు రైతులు తప్పకుండా ఆయా కంపెనీల ఆర్గనైజర్ నుంచి కంపెనీ అగ్రిమెంట్, బిల్లు పొంది వితనోత్పత్తి పంటలు సాగు చేయాలని ఆయన సూచించారు.

## ఇసి గంగిరెడ్డికి ఘన నివాళి

**ప్రజాశక్తి -పులివెందుల రూరల్**

పట్టణంలోని వైయస్ రాజారెడ్డి ఘాట్‌లో డాక్టర్ ఇసి గంగిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన భార్య సుగుణమ్మ, కుమార్తె సీఎం సతీమణి వైయస్ భారతి, తనయుడు దినేష్‌రెడ్డి ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. హాస్పిటల్స్ సిబ్బందికి దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైయస్ ప్రతాప్‌రెడ్డి, వైయస్ మనోహర్‌రెడ్డి, ఆయన భార్య ప్రమీలమ్మ, జనార్దన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, పురపాలక చైర్మన్ వరప్రసాద్, పలువురు పాల్గొన్నారు.



గంగిరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

## సమస్య పరిష్కారానికి చర్యలు

**ప్రజాశక్తి - చాపాడు**

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వాయిపల్లెకు వెళ్లే మార్గంలో కడప-కర్నూలు జాతీయ రహదారి వంతెన కింద వర్షపు నీరు నిలుస్తూ చాలా కాలంగా ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. సమస్యను గుర్తించిన సంబంధిత అధికారులు వర్షపు నీరు నిలువకుండా వెళ్లేలా ఇరు వైపులా కాలువను తవ్వి పైపులైను ఏర్పాటు చేశారు. వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారుతుండడం వల్ల ప్రజలు ఈ మార్గాన ప్రయాణించాలంటే ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు బురద నీటిలో దిగి వెళ్లాల్సి వచ్చేది. తీవ్ర అసౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం జాతీయ రహదారి అధికారులు శాశ్వత పరిష్కారం చూపడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన వద్ద ఇటీవల అనుసంధాన రోడ్లను కూడా మరమ్మతులు చేసి ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.



నీరు పోవుటకు ఏర్పాటు చేస్తున్న అధికారులు

## సమాజంలో అందరూ సమానులే

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

సమాజంలో ఆడ, మగ అనే తేడా లేకుండా అందరూ సమానమేనని డాక్టర్ సుచరిత తెలిపారు. మండల పరిధిలోని చిలంకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని స్థానిక పిహెచ్‌సి వైద్యులు సుచరిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆడపిల్లను రక్షించండి.. ఆడపిల్లను చదివించండి అని పాఠశాలలోని బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ ఆడపిల్లల సంఖ్య మగ పిల్లలతో సమానంగా లేదని, ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోందని, ఇలాగే కొనసాగితే సామాజిక అసమానతలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, సిహెచ్‌ఒ రమాదేవి, సూపర్వైజర్ సుభద్ర పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

# క్రైం కార్నర్

## 47 మద్యం సీసాలు సీజ్

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండలంలోని తుడమలదిన్నె, బోయపల్లి గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇరువురిని అదుపులోకి తీసుకొని 47 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందిదాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

### జూదరులు అరెస్టు : నగదు స్వాధీనం

మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.